# స్వాగతం పలికిన సంకెళ్ళు

## ఎస్.రత్నఫణి - 4

"మేడమ్ మిమల్ని మేనేజరుగారు పిలుస్తున్నారు. టెలికమ్యూనికేషన్స్‌కు సంబంధించిన ఫైలు తీసుకురమ్మన్నారు" అంటూ చెప్పాడు అటెండర్ ఆదినారాయణ. ఇలా వచ్చి కుర్చీలో కూర్చుందో లేదో అప్పుడే పిలుపు. వెళ్ళి దర్శనమిచ్చి రావాలేమో ఆ ఓల్డ్‌బగ్‌కు అనుకుంటూ ఆ ఫైలు తీసుకొని సీట్లోంచి లేచి మేనేజరుగారి రూములో కడుగుపెట్టింది అపురూప.

ముఖానికి లేని చిరునవ్వు పులుముకొని, ముఖాన్ని ప్రసన్నంగా మార్చుకొని "గుడ్మాణింగ్ సార్" అంటూ విష్ చేసింది. "హలో వెరీ వెరీ గుడ్మాణింగ్. ఆ ఫైలిలా ఇవ్వమ్మా అపురూప" అంటూనే ఆమె చేతి వేళ్ళను పూర్తిగా తన చేతితో నిమిరి ఆ ఫైలును తీసుకుంటున్నట్లు నటించాడు. "ఈ ముసలి గుంటనక్క ఇందుకే తనను పిలిచింది.' లేకపోతే ఆ ఫైలు ఇప్పుడు అస్సలు అవసరం లేదు. ఏదో ఒక వంకతో తనను పిలిచి, తనివితీరా కళ్ళతో తన అందాన్ని తాగేసేట్లుగా చూసి, వాలుగు చెత్తకబుర్లు చెప్పికాని నన్ను వదలడు డర్టీరోగ్" అని మనసులోనే తిట్టుకుంటూ "మీరు ఈ ఫైలు చూస్తుండండి సార్. నేనిప్పుడే వస్తాను" అంటూ వెళ్ళి తన సీట్లో కూర్చొని పని చేసుకోసాగింది ఆమె.

ఆ ఆఫీసు మేనేజరు పేరు సుందర్రావు. పేరైతే సుందరంగానే ఉందికాని ఆ మనిషి రూపం మాత్రం దానికి పూర్తిగా వ్యతిరేకం. నలభైఐదు, నలభై ఎనిమిది మధ్య ఉంటుంది అతని వయస్సు. సగం పైగానే తెల్లబడ్డ జుట్టు, సోడాబుడ్డి కళ్ళద్దాలు, గారపళ్ళు, నోరు తెరిస్తే పగలేమో సిగరెట్టు వాసన, రాత్రేమో విస్కీ వాసన. ఆ రూపురేఖలకు తగ్గట్టు ఆఫీసుకు వస్తున్నప్పుడు ఎదుటి వాళ్ళకు వెకటొచ్చేట్టుగా స్ప్రే చేసుకున్న సెంటుతో పూలరంగడిలా వస్తాడు. ప్రస్తుతం ఆయనకు భార్యలేదు. మరణించి చాలా ఏళ్ళు గడిచాయి. అబ్బయిలిద్దరూ ఇంకోవూళ్ళో హాస్టల్లో ఉండి చదువుకుంటున్నారు. ఉన్న ఒక్కమ్మాయికి పెళ్ళయింది. కంటికి కన్పించిన అమ్మాయినల్లా నోటితో "అమ్మా" అని పిలుస్తూనే కళ్ళుతో రేప్ చేస్తున్నట్టుగా చూస్తాడు. ప్రస్తుతం అపురూపను కూడా అదే దృష్టితో చూస్తున్నాడు.

అపురూప పేరుకు తగ్గట్టు అపురూపంగా ఉంటుంది. కాలేజీలో చదివే రోజుల్లో కాలేజీ బ్యూటీగా యువకుల గుండెల్లో నిండి ఉండేది అంటే అతిశయోక్తి కాదు. అంతటి అందాలరాశి, లావణ్య లతిక ఆమె. అపురూప ఆఫీసులో కూడా చాలా రిజర్వ్‌డ్‌గా వుంటుంది. మేల్ కొలీగ్స్‌తో ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడేది. వారితో స్నేహంగా ఉంటే వారు దాన్ని ఇంకో విధంగా అర్థం చేసుకొని వెకిలి చేష్టలు చేస్తారనే భయంతో తన లిమిట్స్‌లో ఉండేది. ఫిమేల్స్‌తో మాత్రం కొంచెం క్లోజ్‌గా మూవ్ అయ్యేది. ఆమె ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా బాస్ రూపంలో అలాంటి ఆపద రానేవచ్చింది.

"మేడమ్ మిమ్మల్ని మేనేజరు గారు రమ్మంటున్నారు" అని చెప్పాడు ఆదినారాయణ. అబ్బ ఈ జిడ్డుముఖం ఇప్పుడే వదిలేట్టుగా లేదే అని విసుక్కుంటూ అతని రూమ్‌లోకి ఎంటరయి "ఎస్ సర్" అంటూ మేనేజర్‌గారి ఎదురుగా నిల్చుంది. "చూడమ్మా లెటర్ డిక్టేట్ చేస్తాను వ్రాసుకో అంటూ ఆమె ఎదపొంగులను చూస్తూ అన్నాడు. ఆ చూపులకు కంపరం కలిగినా ఏమీ చేయలేక చూసీ చూడనట్లుగా ఉండిపోయింది. లెటర్ డిక్టేట్ చేసాక వెళ్తుంటే "ఆగు అంత తొందరైతే ఎలా? ఇదిగో ఈ ఫైలు తీసుకెళ్ళిపో" అంటూ అపురూప వెనుక వైపునున్న అల్మారాలోని ఫైలు తీయడానికన్నట్లుగా ఆమె భుజంపై మండి తన చేతిని వేసి అవతల ఉన్న అల్మారాలో వెతుకుతునట్లుగా నటిస్తూ తన భుజ స్పర్శను అనుభవిస్తూ ఆనందించే అతని నీచ మనస్థత్వానికి అసహ్యమేసింది. వెంటనే చటుక్కున ప్రక్కకు జరిగి "పైలు ప్యూన్‌తో పంపించండి సర్" అంటూ కోపంగా విస విసావెళ్ళి పోయింది. ఆమె తన సీట్లో కూర్చుని పనిచేస్తుందన్న మాటేకాని ఎలా ఈ సమస్యని ఎదుర్కోవడం అని విపరీతంగా ఆలోచిస్తూ అనుకుంది. ఇది ఒకరోజు సమస్యకాదు. చేతిలో పెన్నును తీసుకుంటున్నట్లుగా చేతిని తాకడం, కళ్ళలోకి కళ్ళుపెట్టి అసహ్యంగా చూడడం, అవసరం లేకపోయినా తన సీట్లోంచి లేచి నన్ను రాసుకుంటూ అటు ఇటు తిరగడం, నిమిష నిమిషానికి ఏదో ఒక మిషతో పిలిపించి తన వైపు చూడకుండా, పిలిచిన కారణం చెప్పకుండా తన ఒంపు సొంపులను ఆబగా చూస్తూ వెకిలిగా మాట్లాడటం పరిపాటయి పోయింది. అతని ప్రవర్తన అతి జుగుప్సాకరంగా ఉంది. నిన్నటికి నిన్న "సినిమా కెళ్దాం వస్తావా అపురూప" అంటూ అడిగాడు. ఎంత ధైర్యం వాడికి. వెంటనే చెప్పు తీసుకొని ఆ దవడ ఈ దవడ పగిలేట్లు ఈడ్చి కొట్టాలన్పించింది. కాని బురద గుంటలో రాయేస్తే ఆ బురద చిట్లేది తన మొహంపైనే ఐనా వీడిని ఊర్కే వదలకూడదు. ఒక ఆట ఆడిస్తాను అని మనసులో అనుకొని "నో సర్ నాకు హెల్త్ బాగాలేదు, అయాం సారీ. ఒకవేళ మీరు అంతగా కంపెనీ కావాలని కోరుకుంటే ఒక హెల్ప్ చేయగలను సర్" అంటూ వినయంగా చెప్పింది. "ప్లీజ్ అపురూపా అదేంటో త్వరగా చెప్పయ్ ప్లీజ్" అంటూ దీనంగా ముఖంపెట్టి భిక్షగాడిలా అడుగుతున్న అతన్ని చూసి చిరునవ్వు నవ్వుతూ "మా కజిన్ సౌందర్యను మీకోసం కన్విన్స్ చేసి పంపిస్తాను. దానికి పిక్చర్స్ అంతే తగని పిచ్చి. తనను నా బదులుగా ఇదొక్కసారికి మాత్రమే పంపిస్తాను. ఓ.కె.నా సార్" అంది. "ఓ ష్యూర్, తప్పకుండా అలాగే చెయ్. ఐతే నెక్ట్స్‌టైమ్ మాత్రం నువ్వు తప్పకుండా నాతో పిక్చరుకి రావాలి. అలా అయితేనే ఒప్పుకుంటాను. బైదిబై మీ ఇంటికి కారు పంపిస్తాను. సాయంత్రం ఐదు గంటలకల్లా సౌందర్య గారిని రడీ అయి ఉండమనండి" అని అపురూపతో చెప్పి "హా లక్కీ అయామ్ ఈ రోజు ఆ సౌందర్యతో ఎంజాయ్ మెంట్. నెక్ట్స్ ఇంకోరోజు ఈ అపురూపతో ఒక స్వీట్ ఈవినింగ్. అదృష్టమంటే తనదే. కాకపోతే ఇద్దరమ్మాయిలతో రెండు సాయంత్రాలు గడపడం అంటే మాటలా? వండ్రఫుల్. అవును అపురూప తన కజిన్ పేరు సౌందర్య అని చెప్పింది. పేరే

ఇంత సౌందర్యంగా ఉంటే ఇక ఆవిడెంత సౌందర్యంగా ఉంటుందో అని ఊహా లోకాల్లో తేలి పోతూ ఐదు గం:లకల్లా నవ మన్మథుడికే రోత పుట్టేంత వికారంగా తయారయ్యాడు. పాపం ఆయ నకు మాత్రం తనకు తాను నవ మన్మథుడిలా అద్దంలో కన్పించి,అన్పించి తెగ మురిసిపోయాడు.

ఐదు గంటలకే కారు పంపినా ఇంకా రాలేదేంటబ్బా ఆ అమ్మాయి? ఓహో, ఎంతయినా ఆడవాళ్ళు కదూ 'టాయ్‌లెట్' అవ్వాలంటే కొంచెం లేటే మరి. అందునా తనలాంటి అందగాడితో సినిమాకి రావడమంటే. మజాకా అనుకుంటుండగానే కారు రానే వచ్చింది. ఆత్రుతగా కారులోకి తొంగి చూసిన సుందర్రావుకు ఎవ్వరూ కన్పించలేదు. ఇదేం టబ్బా. అపురూప ఎప్పుడూ అబద్ధం చెప్పదే. ఇప్పుడెందుకిలా చేసింది అని అనుకుంటుండగానే కారుడోర్ ఓపెన్ చేసిన చప్పుడుకు ఉలిక్కిపడి తల అటువైపు తిప్పుతుండగానే కన్పించిన దృశ్యం చూసి కళ్ళు తేలేసాడు. అందుకు కారణం సౌందర్య రూపం, వయస్సు, హైటు, వైటు చూసి. సౌందర్య ఎనిమిదేళ్ల ముద్దుల చిన్నారి. "హాయ్ అంకుల్ గుడీ వినింగ్ పిక్చర్ కెళ్దాం, త్వరగా కారెక్కండి అంకుల్" అన్ని ముద్దు మాటలు విన్పించి స్పృహలోకి వచ్చిన సుందర్రావు జరిగిన మోసం తెల్సుకొని ఏమీ చేయలేక చచ్చినట్టూరు కున్నాడు.

మొన్నకూడా "రండి హోటల్‌లో లంచ్ చేద్దాం కమాన్. నా స్కూటర్ పైన వెళ్దాం" అని వెకిలిగా నవ్వుతుంటే నా ఒంటిపైన తేళ్ళు, జర్రిలు, గొంగళి పురుగులు పాకినట్లు అన్పించింది. ఇంతకు ముందు కూడా ఈ ఆఫీసుల్లో పనిచేసే ఆడవారిని అతను ఇలాగే లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తే కొంతమంది ఉద్యోగానికి రిజైన్ చేసారని, మరికొంత మంది అతని బాధ పడలేక ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్ళారని తను వినింది. కాని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తుంది అని మనసులో అనుకుంటూ "నో థాంక్స్ నేను టిఫిన్ బాక్స్ తెచ్చుకున్నాను. మీకు తప్పకుండా లంచ్‌కు తీసుకెళ్ళారనే ఉద్దేశం ఉంటే "అదిగో అటు చూడండి ఆఫీసు కెదురుగా చెట్టునీడలో కూర్చున్న ముసలి భిక్షగత్తెకు భోజనం పెట్టించండి సార్. అన్నదాత సుఖీభవ అని దీవిస్తుంది" అంటూ జాలిగా ముఖం పెట్టి అమాయకంగా చెప్పేసరికి పళ్ళు పటపటా కొరుకుతూ, ఒళ్ళంతా ఊగిపోయేట్లుగా ఆగ్రహంతో చిందులు త్రొక్కుతూ వెళ్ళిపోయాడు.

రోజూ ఇలా ఐతే లాభం లేదు. దీనికి ఏదో ఒక పరిష్కారమార్గం కనుక్కోవాలి. ప్రతిరోజూ ఏదో ఒక వంకపెట్టి అక్కడికి ఇక్కడికి రమ్మని తనను సుందర్రావు వేధించడం, తను రానని బ్లంట్‌గా చెప్తే అది మనసులో పెట్టుకొని ఏం చేస్తాడో ఏమో? ఐనా గోటితో పోయే దానికి గొడ్డలిదాకా ఎందుకని ఇటువంటి సమస్యలను సున్నితంగానే పరిష్కరిస్తూ వచ్చింది. కాని ఇది ఇంతటితో ఆగేట్లుగా కన్పించలేదు. దీనికి శాశ్వత పరిష్కార ఆలోచించాలి అని అనుకుంటుండానే సుందర్రావే ఆ అవకాశం కల్పించాడు. మరుసటి రోజు అపురూపని పిలిచి "చూడమ్మా అపురూపా ఈ రోజు నా బర్త్‌డే. నువ్వు తప్పకుండా రావాలి. సాయంత్రం ఆరు గం:కు హోటల్ అజంతాగే పార్టీ ఏర్పాటు చేసాను. మర్చిపోకుండా తప్పకరా! నీకోసం ఎదురు చూస్తుంటాను. నీవు రాకపోతే నేను హర్ట్ అవుతాను మరి" అంటూ మరీ మరీ చెప్పాడు. "అలాగే సార్ తప్పక వస్తాను" అని చెప్పి తన ప్లానును అమలులో పెట్టాలని నిర్ణయించు కుంది అపురూప.

ఆ రోజు సాయంత్రం నీట్‌గా తయారై హోటల్ అజంతాకు వెళ్ళింది. అప్పటికే సుందర్రావు ఒక టేబుల్ దగ్గర కూర్చొని ఎవరికోసమో వెయిట్ చేస్తున్నట్లుగా కనిపించాడు. అతను పడుచుకుర్రాడిలా ట్రిమ్‌గా కన్పించాలని చేసిన భగీరథ ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరై అతన్ని చూసినవారికి ఎబ్బెట్టుగా అన్పించ సాగింది.

"హలో సార్ ఇంకా ఎవరూ రాలేదే. నేనే ఫస్టనుకుంటూ వచ్చింది. ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్లున్నారు" అని పలుకరించి "మెనీ హాపీ

రిలర్స్ ఆఫ్ దిడే'' అంటూ గ్రీట్ చేసింది. ''ఎవరి కోసమో కాదు అపురూపా నీ కోసమే నేను ఎదురు చూస్తున్నది. పద, పద'' అంటూ టేబుల్ దగ్గర్నుండి లేచిన అతన్ని ''ఇంకా ఎక్కడికండి? ఇక్కడే కదా మీరు పార్టీ ఇచ్చేంది'' అంటూ అడిగింది. ''ఇచ్చేది ఇక్కడే ఐనా, ఇలా బయట నలుగురిలో కాదు. నేను ఒక రూమ్ బుక్ చేసాను. అక్కడ నువ్వు నేను మాత్రమే. ఇలి గజిబిజిగా నలుగురూ గోలగోలగా మాట్లాడుకుంటుంటే చేసుకున్న పుట్టినరోజు అనుభవం మధుర స్మృతిగా మిగిలిపోక చేదు అనుభవంలా గుర్తుడిపోతుంది. అందుకే ఇష్టమైన వారితో పుట్టినరోజు పండుగని చేసుకుంటే అది గుర్తొచ్చినప్పుడల్లా ఒక తీపిగురుతులా జీవితంలో మిగిలిపోతుంది. ప్లీజ్ పైకెళ్దాంరా నీవు పైకి రాకపోతే ఈ రోజు నన్ను డిజప్పాయింట్ చేసినట్టువుతావు. ఆపై నీ ఇష్టం'' అంటూ ముఖం చిన్న బుచ్చుకున్నట్టుగా మాట్లాడితే తప్పని సరై ఒక్కసారి చుట్టుప్రక్కల చూసి మనస్సు స్థిమత పరుచుకొని అతనితో లిఫ్ట్‌లో పైకెళ్ళి సూట్‌లోకి ఎంటరయింది. ఆ గది చూడగానే కొత్తదంపతుల ఫస్ట్‌నైట్ గదిని మరిపించేలా కన్పించింది. అతను బర్త్‌డే పార్టీ ఇవ్వాలనుకుంటే ఈ గదిలో ఈ అలంకరణ ఏమిటి? గది గోడలపై చూసిన వారిని రెచ్చ గొట్టేట్టుగా ఆ నగ్న చిత్రాల పెయింటింగ్స్ ఏమిటి? అని అనుకుంటుండగానే 'ఎలా ఉంది ఈ రూమ్? నిన్నంతా కష్టపడి ఈ రూమ్‌ని డెకరేట్ చేయించాను. ఎలా ఉంది నా టేస్ట్'' అంటూ అసహ్యంగా నవ్వాడు. 'కమాన్ సెలబ్రేట్ చేసుకుందాం రా' అంటూ స్వీట్స్, హాట్స్, పఫ్స్ టేబుల్లో సరిపెట్టి తను ఒకటి తీసుకొని రెండువది ఆమెకిచ్చాడు. అది కొనిచ్చిన తర్వాత కూల్ డ్రింక్ ఆమెకు ఆఫర్ చేసి హాట్‌డ్రింక్ తను తీసుకోబోయాడు. వెంటనే అపురూప ''సార్, టిఫిన్ హెవీగా అయింది. ఇంక వెళ్ళొస్తాను'' అంటూ కూల్ డ్రింక్ అక్కడ పెట్టేసి లేవబోయింది. ''నో, నో నువ్వెళ్ళిపోతే పార్టీ సగంలో ఆగిపోయినట్లే ఐడోంట్ లైకిట్, ప్లీజ్ హావిట్'' అంటూ బలవంతం చేయడంతో తప్పని సరై కూల్‌డ్రింగ్ త్రాగేసరికి సుందర్రావు రెండో రౌండ్‌లోకి వచ్చాడు. నెమ్మదిగా మత్తు అతని శరీరంలోకి ఎక్కి నిషాను కలిగిస్తుంది. పైకి లేచిన ఆమెను చూసి ''అంత తొందరెందుకే? ఇంకా ముందు ముందు మజా ఉండగా అప్పుడే వెళ్తానంటే ఎలా?'' అంటూ రెండు గుక్కల్లో మిగిలిన మందును గొంతులో పోసుకొని, ఆమె పారిపోకుండా వాకిలికి అడ్డుగా నిల్చొని తలుపు మూసి గొళ్ళెం పెట్టాడు. ఈ హఠాత్పరిణామానికి నివ్వెరబోయిన అపురూప తేరకోకముందే అతని గొంతుల్లో నుండి మత్తుగా వస్తున్న మాటలు ఆమెను ఈ లోకంలోకి తెచ్చాయి. 'రూప డార్లింగ్

## ఎడ్వర్టైజ్‌మెంట్‌లో లత

వ్యాపార ప్రకటనల రంగంలోకి అడుగుపెట్టని వారంటూ ఇక ఎవరూ మిగలరేమోనవిపించేలా —మధుర గాయని లతామంగేష్కర్ 'గ్లైకోడిన్' దగ్గుమందు ప్రకటనలో వేసేందుకు అంగీకరించింది. దీనికి దర్శకుడు గోవింద నిహలానీ.

నిన్ను చూడగానే నాకు పిచ్చెక్కింది. ఎన్ని రోజులనుండో ఇలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్న నాకు ఈ రోజు ఆ సువర్ణావకాశం దొరికింది. నిన్ను వదలను. నా అందాల సుందరి, నా వలపుల పెన్నిధి ఎన్ని రోజులకు నా చేతికి చిక్కావే నా అపురూప చిలక. నీ మీద కోరకతో నేను పిచ్చివాడినై పోయాను. నీపై మోహంతో నేను వెర్రివాడినై పోయాను. ఈ రోజు నా బర్త్‌డే కాదు. అంతా అబద్ధం. నీకోసం, నీ పొందుకోసం ఎలా తపించి పోతున్నానో తెలుసా? అబ్బ, నిన్ను ఇలా చూస్తూ నేనింక ఆగలేను'' అంటూ ఆమె భుజాలను గట్టిగా పట్టుకొని, ఆమె పెదవులపై తన పెదవులను అదిమిపెట్టి మంచం పైకి తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తూ, ఆమె తనను ఎదురించలేదులే అనుకున్న సుందర్రావు ఆమె చెయ్యి గాల్లోకి లెయ్యడము, అతని చెంప పగలడమూ, రుద్ర రూపంతో భద్రకాళిలా ఎదురుగా నించున్న అపురూప తలుపులు తెరిచి గట్టిగా విజిల్ వేయడము చకచకా జరిగిపోయినా, ఆ చేతనుడై ఇంకా అలాగే నిలబడిన సుందర్రావును చూసి ''ఓరేయ్ సుందర్రావు నీ పాపం పండిందిరా. అందుకే నీకు ఇలాంటి నీచపు బుద్ధి పుట్టింది. నీకూ ఒక కూతురిందే? నన్ను ఇలా చేసే ముందునన నీ కూతురు ముఖం నాలో నీకు కన్పించలేదా? ఆ అమ్మాయినిలా ఎవరైనా పశు ప్రవృత్తితో లొంగదీయాలనుకుంటే నీ మనసెంత తల్లడిల్లుతుందిరా దుష్టుడా? నన్ను బలవంతం చేసినట్లు నీ కూతురిని ఏ మగాడైనా చెరచడానికి ప్రయత్నిస్తుంటే నీ గుండె ఎంతగా మండుతుందిరా నికృష్టుడా? నీ కూతుర్నిలాగే మాయమాటలు చెప్పి తన బాస్ దుర్బుద్ధితో ఏ హోటల్‌కైనా రమ్మంటే అమాయకంగా వెళ్ళినపుడు నీ వెంత కుతకుత లాడుతావురా కామాంధుడా? అంటే నీ కూతురికైతే ఒకరకం ఫీలింగ్, ఇంకో అయ్య కూతురైతే మరోరకంగా ఫీలింగా? ఛ, ఛ ఏళ్ళొచ్చాయి ఎందుకు? అడ్డగాడిదకు కూడా వస్తాయి. మనిషన్న తర్వాత మానవుడై పుట్టాక ఉచ్చనీచాలు, మంచి చెడులు తెలుసుకొని మసలు కోవాలి. నీవు ఒక హైయ్యర్ ఆఫీసరై ఉండి ఇలా ప్రవర్తిస్తే నీ క్రింది ఉద్యోగులు ఇంకెలా ప్రవర్తించాలిరా? అంటే ఉద్యోగం చేసే ఆడది నీ దృష్టిలో ఒక ఉంపుడుగత్తె, ఒక వ్యభిచారి లేదా ఎవడు పిలిస్తే వాడితో వెళ్ళడానికి రడీగా ఉండే ఒక బజారు స్త్రీ అనుకున్నావా? నీవు ఏ ఉద్దేశ్యంతో పిలిచిందీ నాకు ముందే తెలుసురా రాస్కెల్. అందుకే నేను అవకాశం కోసం చూసి



ఎదురు దెబ్బలు తీసాను. ఏంటో తెలుసా అది అంటూ విజిల్ శబ్దం విని అప్పుడే అక్కడికి వచ్చిన ఆఫీసు ఉద్యోగులను, ఎ.ఎస్.పి. అవినాష్‌ను చూపిస్తూ ఈ ఉద్యోగులందరి ముందు నీ గౌరవం, హోదా, అధికారం, ప్రతిష్ఠ అన్ని మంట గలిసి పోయి నేటినుండి వీరంతా నీ ముఖంపైన 'ఛీ' అని ఉమ్మేసే స్థితికి నిన్ను తీసుకురావడమూ, ఆపై అవినాష్ గారితో ముందే సంప్రదించి నేను ఇక్కడికి రావడము వల్ల నీ దుర్మార్గపు పనులను ఆయన నీకు తెలీకుండా ఇక్కడ ఆటోమేటిక కెమెరా అడ్జెస్ట్ చేసి ఫోటోలు తీయించి వాటి ద్వారా నిన్ను జైలుపాలు చేయడము. ఆయన పోలీస్ ఆఫీసరు అయినందువల్ల కెమెరా ఫిక్స్ చేయడానికి ఎటువంటి అడ్డంకులు, ఇబ్బందులు ఎదురవ్వలేదు. ఓరేయ్ పిచ్చి సన్నాసి ఆడదంటే అబలకాదురా ఆదిపరాశక్తి అని గుర్తుంచుకో. మరో షాకింగ్ న్యూస్ కూడా విని తరించు. ఈ ఎ.ఎస్.పి. అవినాష్ గారే త్వరలో నా కాబోయే శ్రీవారు. స్త్రీ జనోద్ధరణకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రభుత్వం ఉద్యోగపు రిజర్వేషన్లు, ఉద్యోగావకాశాలు కల్పించినా కూడా నీలాంటి మధాంధుల వల్ల అవి నిష్ప్రయోజనమై పోతున్నాయి. ఉద్యోగానికై వచ్చిన ఆడవారు మీ కోరికలు తీర్చుకోవడానికి ఉపయోగపడే రబ్బరు బొమ్మలు కాదు. మీలాంటి మగాళ్ళలో నైతికంగా మార్పు వచ్చినప్పుడే ఉద్యోగిమలంతా స్వేచ్ఛగా స్వతంత్ర్యంగా, నిర్భీతిగా ఏ అవకాశాన్నైనా వినియోగించుకుంటారు.

చూడూ, విషరోగ క్రిములు పట్టిన నీ మెదడును చట్టాల ద్వారా, శాసనాల ద్వారా మార్చలేము. బలవంతంగా బ్రెయిన్ వాష్ చేసీ సాధించలేము. పరివర్తన అనేది నీలో కలగాలి. పశ్చాత్తాపమనేది నీలో రావాలి. మనిషిగా పుట్టిన తర్వాత కనీసపు మనిషిగా బ్రతకడం నీ ధర్మం. కాదూ ఇంకా పశువులానే జీవిస్తాను అంటావా అది నీ ఖర్మం. ప్రతి ఆడదాని ముఖంలో నీ కూతురిని చూడు. అంతేకాని వంపు సొంపులను తడిమే వంకర చూపులు కాదు. అలాగే ఉద్యోగం చేసే యువతిలో అమ్మను చూడు అంతేకాని ఇణువణువును సెక్స్ దృష్టితో కాదు. కనీసం కటకటాల నుండి బయటికి వచ్చిన తర్వాతైనా నీవు మనిషిగా మారుతావని ఆశిస్తాను'' అంటూ అవినాష్ కేసి చూసింది, మీ పని కానివ్వమన్నట్లుగా. సంకెళ్ళతో స్వాగతం పలుకుతున్నట్లుగా ముందుకు సాగివస్తున్న అవినాష్‌ను చూసి సిగ్గుతో తలవంచుకున్నాడు సుందర్రావు.

# రకరకాల భయాలు

రకరకాల ఫోబియాలకు కారణం ఏమిటి?

అసలు ఒక వ్యక్తి దేనికో ఒక దానికి భయపడడం ఎందుకు? దీనికి కారణం ఏమిటి?

''మనం భయపడేది, ఎక్కువగా మనని భయపెట్టేదీ భయమే'' అన్నారు ఫ్లాంక్లిన్— డి రూజ్ వెల్ట్.

కొందరికి బహిరంగా వున్న స్థలాలు (ఓపెన్ ప్లేసెస్) అంటే భయం. దాన్ని 'ఎగోరా ఫోబియా' అంటారు.

ఈ ప్రపంచంలోని జనం రకరకాల వస్తువులకూ, పరిస్థితులనూ చూసి భయపడుతూ వుండడం చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఇటీవల ప్రపంచ దేశాలను పట్టి పీడిస్తున్న 10 ఫోబియాలను పరిశీలిద్దాం. ఈ ఫోబియాలు అందరిలోనూ, లేదా ఎక్కువ మందిలోనూ లేక పోయినా మొత్తమ్మీద అన్ని దేశాల్లోనూ వున్నాయి.

1) ఎలక్ట్రో ఫోబియా: కోళ్ళను చూసి భయపడడం.

2) ఏంథో ఫోబియా: పువ్వుల్ని చూసి భయపడడం.

3) అరచీ బ్యూటైరోఫోబియా: వేరు శనగ కాయలంటే భయపడటం, వెన్న అంగుడికి అతుక్కుంటేను, అతుక్కుంటూందనీ భయపడడం.

4) కాథిసో ఫోబియా: క్రింద కూర్చోవడానికి భయపడడం.

5) 'యూఫోబియా: శుభవార్తలు వింటే భయం కలగడం.

6) జెనూ ఫోబియా: మోకాళ్ళని గురించి భయపడడం.

7) లివో ఫోబియా: శరీరంలోని ఎడమ వైపున వుండే భాగాలను గురించి భయం.

8) లినోనో ఫోబియా: తీగలను చూసి భయపడడం.

9) ధానో ఫోబియా: ఖాళీగా వున్నందున కలిగే భయం, బోర్ కొడుతున్నందున కలిగే భయం.

(ఫోబియాలపై ఎడ్ లూకైర్, డెబ్రాసాల్మన్‌ల టెక్స్ట్ ఆధారంగా)

— కిశోర్. జె.